నమస్తే తెలంగాణ
సూర్యాపేట
I | నల్లగొండ, ఆదివారం 4 మే 2025 | SURYAPET

సాంకేతిక కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తులు

భూదాన్ పోచంపల్లి, మే 3 : మండలంలోని జలాల్‌పూర్ గ్రామంలో గల స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థలో దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన (డీడీయూజీకేవై) సహకారంతో ఉపాధి సాంకేతిక కోర్సుల్లో శిక్షణకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థలో మూడున్నర నెలల కాలపరిమితితో కూడిన ఎకౌంట్ అసిస్టెంట్ (ట్యాలీ) బీకాం పాస్, కంప్యూటర్ హార్డ్‌వేర్ అసిస్టెంట్ (ఇంటర్మీడియట్ పాస్), ఆటోమొబైల్ టు వీలర్ సర్వీసింగ్ (పదో తరగతి పాస్) కోర్సులు నిర్వహించబడునని తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న యువత ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ సెట్, పాస్ పోర్ట్ సైజ్ ఫొటో, ఆధార్, రేషన్ కార్డుతో ఈ నెల 5న ఉదయం 10:30 గంటలకు రామానందతీర్థ సంస్థలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. సంస్థలో ఉచిత శిక్షణ, హాస్టల్, భోజన వసతితోపాటు ఉద్యోగం కల్పించబడునని తెలిపారు. పూర్తి వివరాలకు 9133908000, 9133908 111, 9133908222, 9948466111 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఇందిరమ్మ ఇండ్లపై నీలినీడలు

మితిమీరిన ఇందిరమ్మ కమిటీల జోక్యం

లబ్ధిదారుల ఎంపిక పూర్తిగా కమిటీల కనుసన్నల్లోనే..

- అధికారులు సర్వేల వరకే పరిమితం
- రాజకీయ జోక్యంతో పేదలకు దక్కని ఇండ్లు
- అర్హులను పక్కన పెట్టి అనర్హులకు పెద్ద పీట
- పైలట్ గ్రామాల్లో భారీగా తగ్గిపోయిన లబ్ధిదారుల సంఖ్య
- 3 నెలలైనా మెజార్టీ గ్రామాల్లో ముగ్గు పడని వైనం
- లక్ష రూపాయల ప్రభుత్వ సాయమూ అరకొరగానే
- చివరకు సాగేనా అన్న సందేహాల్లో సామాన్యులు

నల్లగొండ జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రహసనంగా మారింది. లబ్ధిదారుల ఎంపిక నుంచి మొదలు పెడితే నిర్మాణం వరకు వివిధ దశల్లో ఎదురవుతున్న ఆటంకాలను అధిగమించి ముందుకు సాగే పరిస్థితి లేదు. ఓ వైపు పైలట్ గ్రామాల్లో నేటికీ ముగ్గు పోయని గ్రామాలు ఎన్నో ఉండగా, రెండో విడుతలో భాగంగా మిగతా గ్రామాల్లో లబ్ధిదారుల ఎంపిక వివాదస్పదంగా మారుతున్నది. లబ్ధిదారుల ఎంపికలో గ్రామాల్లో కాంగ్రెస్ నేతలకు ప్రాతినిధ్యం కల్పిస్తూ ఏర్పాటు చేసిన కమిటీల జోక్యం మితిమీరడంతో అనర్హులకు అవకాశం దక్కుతున్నది. నిజంగా సొంత స్థలం ఉండి ఇల్లు లేని నిరుపేదలకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉండగా రాజకీయ కోణంలో వారికి జాబితాల్లో చోటు దక్కడం లేదు. తొలి దఫా జాబితా ఎంపికలో క్షేత్రస్థాయి నుంచి అందుతున్న సమాచారం ప్రకారం మెజార్టీ లబ్ధిదారులు కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే ఉండడం గమనార్హం. దాంతో కొన్నిచోట్ల నిజమైన అర్హులు గ్రామాల్లోని అధికారుల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. మరికొన్ని చోట్ల రోడ్లపైకి వచ్చి ఇండ్ల జాబితాలపై నిరసనలకు సైతం దిగుతున్నారు. సరైన రీతిలో పర్యవేక్షించాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో సమస్య మరింత జఠిలంగా మారుతున్నది.

– నల్లగొండ ప్రతినిధి, మే 3(నమస్తే తెలంగాణ)

కొండమల్లేపల్లి మండంలోని పైలట్ గ్రామం చెన్నంనేనిపల్లి గ్రామపంచాయతీలో బేస్‌మెంట్ కట్టి బిల్లు రాకపోవడంతో ఆగిన ఇందిరమ్మ ఇంటి పనులు

ఎన్నికల మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ చెప్పిన దానికి నేడు క్షేత్రస్థాయి పరిస్థితులకు అస్సలు పొంతనే లేదు. ఇందిరమ్మ ఇండ్లతోపాటు మరో మూడు పథకాలను జనవరి 26 నుంచి ప్రారంభిస్తున్నట్లు ఆర్భాటంగా ప్రకటించిన ప్రభుత్వం ఆ తర్వాత మండలానిని ఒక పైలెట్ గ్రామానికే పరిమితం చేసిన విషయం తెలిసిందే. ఆ గ్రామాల్లోనూ ఒక అడుగు ముందుకు.. రెండు అడుగులు వెనక్కి అన్నట్లు పథకం అమలు కొనసాగుతున్నది. గణతంత్ర దినోత్సవం రోజున పైలెట్ గ్రామాల్లో ఎంపిక చేసిన లబ్ధిదారుల సంఖ్యకు ఆ తర్వాత సర్వే చేసి ఫైనల్ చేసిన సంఖ్యకు పొంతనే లేదు. మంజూరు పత్రాలు అందుకున్న వారిలోనూ సగానికి సగం లబ్ధిదారులను కుదించివేశారు. కొందరు స్థానికంగా ఉండడం లేదని, మరికొందరికి ట్రాక్టర్లు, లారీలు, టాక్సీలు, కార్ల వంటి నాలుగు చక్రాల వాహనాలు ఉన్నాయని పక్కకు పెట్టారు. ఇంటి స్థలం నిబంధనల ప్రకారం లేదనే కారణంతోనూ లబ్ధిదారులను తగ్గించారు. దాంతో ఎంపిక చేసిన లబ్ధిదారుల సంఖ్య భారీగా పడిపోయింది. అందులోనూ ఇప్పటికీ మెజార్టీ సంఖ్యలో ఇండ్ల నిర్మాణమే మొదలు పెట్టలేదు. కనీసం మార్కింగ్ కూడా చేయలేదు. ఇక బేస్‌మెంట్ వరకు పూర్తి చేసుకున్న వారిని వేళ్ల మీద లెక్కపెట్టవచ్చు. వారిలోనూ సగం మందికి కూడా తొలి విడుత లక్ష రూపాయల సాయం అందలేదు. ప్రారంభంలో లబ్ధిదారులకు అందజేసిన ప్రొసిడింగ్స్‌లో ఇంటి నిర్మాణ విస్తీర్ణంపై ఇచ్చిన నిబంధనలకు, ప్రస్తుతం కొత్తగా చెప్పున్న వాటికి పొంతన లేకపోవడంతో కొందరు లబ్ధిదారులు అర్ధాంతరంగా అనర్హులుగా మారుతున్నారు. ఇంటి నిర్మాణ విస్తీర్ణం 600 చదరపు అడుగుల దాటవద్దన్న నిబంధనను కొత్తగా చేర్చడంతో ఇప్పటికే అక్కడక్కడా ప్రారంభించిన వారిని అనర్హులుగా తేలుస్తున్నారు. ఇన్ని ఆటంకాల నడుమ ఇందిరమ్మ ఇండ్ల పథకం అసలు ముందుకు సాగుతుందా, మధ్యలోనే ఆగుతుందా అని లబ్ధిదారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. డబ్బులు లేని సమయంలో ప్రభుత్వం ఇస్తుందన్న ఆశతో మొదలుపెడితే తర్వాత పరిస్థితి ఏంటి ఆందోళన చెందుతున్నారు.

ఇందిరమ్మ కమిటీలతో అనర్హులకు...

పైలట్ గ్రామాల్లో పరిస్థితి నత్త నడకను తలపిస్తుండగా రెండో విడుతలో నియోజకవర్గానికి 3,500 ఇండ్లకు సంబంధించి ప్రస్తుతం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరుగుతున్నది. ఏప్రిల్ 30నాటికే తుది జాబితాలు ఖరారు చేయాల్సి ఉండగా, కాంగ్రెస్ నేతలతో కూడిన ఇందిరమ్మ కమిటీలతో తీవ్ర జాప్యం జరుగుతున్నట్లు క్షేత్రస్థాయి పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి. ఇందిరమ్మ కమిటీల్లో గ్రామస్థాయి కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలకు పెద్ద పీట వేయడంతో లబ్ధిదారుల జాబితాపై వారి పెత్తనమే నడుస్తున్నది. దాంతో గ్రామాల్లో లబ్ధిదారుల ఎంపిక వివాదస్పదంగా మారుతున్నది. చాలా చోట్ల జాబితాల్లో కాంగ్రెస్ కార్యకర్తలు, వారికి అనుకూల వ్యక్తులకు మాత్రమే చోటు లభిస్తున్నది. నిజంగా సొంత ఇల్లు లేకుండా ఇంటి స్థలం ఉన్న వారిని సైతం రాజకీయ కోణంలో పక్కన పెట్టిన దాఖలాలు అనేకం ఉన్నాయి. తొలి విడుత జాబితాలో కాంగ్రెస్ మార్క్ స్పష్టంగా కనిపిస్తున్నది. ఎమ్మెల్యేలను సైతం గ్రామస్థాయి నేతలు ప్రభావితం చేస్తుండడంతో నిజమైన అర్హుల ఎంపికపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఈ క్రమంలో గ్రామాల్లో అసలైన అర్హులు పలుచోట్ల ఆందోళనలకు దిగుతున్నారు. పంచాయతీ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇప్పటికీ చాలా చోట్ల అర్హుల జాబితాలను బయటకు వెల్లడించడం లేదు. జాబితాలు బయటకు వస్తే గ్రామాల్లో మరింత గందరగోళ పరిస్థితులు నెలకొననున్నాయి. కేసీఆర్ సర్కారులో అన్ని ప్రభుత్వ పథకాల్లోనూ మధ్యలో ఎవరి జోక్యమూ లేకుండా నేరుగా లబ్ధిదారులకే అందేవి. రైతు బంధు, రుణమాఫీ, కేసీఆర్ కిట్, కళ్యాణలక్ష్మి ఇలా ఏ పథకం తీసుకున్నా నేరుగా అర్హులైన లబ్ధిదారులకు మేలు జరిగేది. కాంగ్రెస్ ప్రభుత్వం కమిటీల పేరుతో తమకు అనుకూలమైన వారికే పెద్దపీట వేస్తున్నదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే సమయంలో లబ్ధిదారుల ఎంపిక సమయంలోనే ప్రభుత్వం ఇచ్చే సాయంలో తమ వాటా కోసం కూడా ముందే ఒప్పందాలు చేసుకుని, వాటికి అంగీకరించే వారికే పథకాలు అందేలా కాంగ్రెస్ నాయకులు జాగ్రత్త పడుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి.

పైలట్ గ్రామాల్లో ఇదీ పరిస్థితి...

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న నల్లగొండ మండలం గుండ్లపల్లి గ్రామంలో తొలుత 115 మందికి మంజూరు పత్రాలు ఇచ్చారు. తర్వాత అందులో 38 మందిని మాత్రమే అర్హులుగా తేల్చారు. ఇందులో ఎనిమిది మందే ఇంటి నిర్మాణం ప్రారంభించగా, ఏ ఒక్కరికీ లక్ష రూపాయలు అందలేదు.
- కనగల్ మండలం తేలకంటిగూడెంలో తొలుత 297 మందికి మంజూరు పత్రాలు ఇచ్చారు. ఆపై 97మందినే అర్హులుగా తేల్చారు. ఇందులోనూ ఆరుగురే బేస్‌మెంట్ వరకు నిర్మాణం చేయగా, వారికి సైతం తొలి విడుత సాయం అందలేదు.
- త్రిపురారం మండలం కంపాసాగర్‌లో 70 మందికి పత్రాలు ఇచ్చి, తొలి విడుత 37 మందినే అర్హులుగా ప్రకటించారు. 12 మందికి మాత్రమే ఇంటి నిర్మాణానికి మార్కింగ్ చేశారు. ఇప్పటి వరకు ఇద్దరు మాత్రమే బేస్‌మెంట్ నిర్మాణం పూర్తి చేయగా, వారికి లక్ష రూపాయలు మాత్రం అందలేదు.
- నిడమనూరు మండలం తుమ్మడంలో 260 మందిని ఎంపిక చేశారు. మంజూరీ పత్రాలు తీసుకున్న వారిలో 41 మంది పునాది లేవల్, 12 మంది బేస్‌మెంట్ లేవల్ వరకు నిర్మాణం చేశారు. బేస్‌మెంట్ లేవల్‌లో ఉన్నవారికి తొలివిడుత డబ్బులు అందలేదు.
- శాలిగౌరారం మండలం తుడిమిడిలో 65 మందిని ఎంపిక చేయగా, ఆరుగురే బేస్‌మెంట్ వరకు నిర్మాణం చేశారు. వారిలో ఇద్దరికి మాత్రమే లక్ష రూపాయలు జమయ్యాయి. మిగతా ఇండ్లకు నేటికీ మార్కింగ్ చేయలేదు.
- కొండమల్లేపల్లి మండలం చిన్నంనేనిపల్లిలో 23 ఇండ్లు మంజూరు చేయగా, ఆరుగురివి నేటికీ ఆన్‌లైన్ సమస్యతో నిలిచిపోయాయి. మిగతా వారిలో ఏడుగురు బేస్‌మెంట్ వరకు నిర్మాణం పూర్తి చేయగా, ఐదుగురికి డబ్బులు జమయ్యాయి.
- దామరచర్ల మండలం రాజగట్టులో తొలివిడుతలో 95 మందికి మంజూరు పత్రాలు ఇచ్చినా, 57 మందినే అర్హులుగా తేల్చారు. ఇక్కడ ఒక్క ఇంటి నిర్మాణం కూడా ప్రారంభం కాలేదు. కనీసం మార్కింగ్ కూడా జరుగలేదు.
- నార్కట్‌పల్లి మండలం జువ్విగూడెంలో 79 మందిని ఎంపిక చేసి 11 మందికే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. నేటికి ఒక్క ఇంటి నిర్మాణం కూడా మొదలుకాలేదు.
- చందంపేట మండలం తేల్దేవర్‌పల్లిలో 13 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి ఏడుగురికి మాత్రమే ఇండ్లు మంజూరు చేశారు. ఇక్కడా ఒక్క నిర్మాణం కూడా ప్రారంభం కాలేదు.
- చండూరు మండలం ఉడతలపల్లిలో 193 మందికి మంజూరు పత్రాలు ఇచ్చినా, చివరకు 65 మందినే అర్హులుగా తేల్చారు. 14 మంది ఇండ్ల నిర్మాణానికి మార్కింగ్ చేయగా, ఆరుగురు బేస్‌మెంట్ వరకు నిర్మాణం చేశారు. ఇందులో కొందరివి 650 చదరపు అడుగుల కన్నా ఎక్కువ విస్తీర్ణం ఉండడంతో చెల్లింపులు నిలిపివేశారు.
- కట్టంగూరు మండలం భాస్కర్లబావిలో 44 మందికి మంజూరు పత్రాలు ఇచ్చారు. తర్వాత సర్వేలో కొందరినే అర్హులుగా తేల్చారు. నేటికీ ఒక్క ఇంటి నిర్మాణం కూడా మొదలు కాలేదు.
- నకిరేకల్ మండలం నెల్లిబండలో 44 మందిని అర్హులుగా గుర్తించగా 25 మంది నిర్మాణాలు మొదలుపెట్టారు. వారిలో ఆరుగురు బేస్‌మెంట్ వరకు పూర్తిచేయగా నలుగురికే లక్ష రూపాయల సాయం అందింది.
- అడవిదేవులపల్లి మండలం ముదిమాణిక్యంలో 149 మందికి మంజూరు పత్రాలు ఇచ్చి తర్వాత సర్వేలో అర్హులను కుదించారు. వారిలోనూ ఒక్కరు మాత్రమే ముగ్గు పోశారు.
- తిరుమలగిరి(సాగర్) మండలం నాయకునితండాలో మొదట 100 మందికి మంజూరు పత్రాలు ఇచ్చి తర్వాత 45 మంది అర్హులుగా తేల్చారు. వారిలో ఐదుగురు మాత్రమే ముగ్గు పోశారు.
- గుర్రంపోడు మండలం జూనుతలలో 102 మందికి మంజూరు పత్రాలు ఇచ్చి తర్వాత సర్వేలో 32 మందిని మాత్రమే అర్హులుగా తేల్చారు. 19 మంది మాత్రమే ముగ్గు పోయగా, అందులో ఐదుగురు బేస్‌మెంట్ వరకు నిర్మించారు.
- మిర్యాలగూడ మండలం రుద్రారంలో 16 మందికిగానూ ఆరుగురి ఇండ్లే నిర్మాణంలో ఉన్నాయి.
- మాడ్గులపల్లి మండలం దాచారంలో 54 మందికి గానూ ఏడుగురు బేస్‌మెంట్ లెవల్ వరకు పూర్తి చేయగా ఐదుగురికే లక్ష రూపాయల సాయం అందింది.
- వేములపల్లి మండలం అన్నపురెడ్డిగూడెంలో 140 మందికి మంజూరు పత్రాలు ఇచ్చినా సర్వే తర్వాత 27 మందికే అనుమతి ఇచ్చారు. వారిలోనూ 11 మందికే బేస్‌మెంట్ లెవల్ నిర్మాణానికి గానూ రూ.లక్ష సాయం అందింది.
- దేవరకొండ మండలం మైనంపల్లిలో 26 మందికి గానూ 23 మంది బేస్‌మెంట్ వరకు నిర్మాణం చేశారు. వారిలో ఒక్కరిరి కూడా తొలి విడుత సాయం లక్ష రూపాయలు అందలేదు.
- మునుగోడు మండలం గుండ్లోరిగూడెంలో 17 మందికి మంజూరు ఇవ్వగా, ముగ్గురే ఇంటి నిర్మాణం మొదలుపెట్టారు. ఒక్కరికి కూడా డబ్బులు అందలేదు.

రేగులకుంట కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశులు

పేరుకే ప్రారంభం.. కొనుగోళ్లు శూన్యం

రేగులకుంటలో 2 వారాలైనా చేపట్టని ధాన్యం కొనుగోళ్లు

ఆత్మకూరు(ఎం), మే 3 : మండలంలోని రేగులకుంటలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 21న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. దీంతో రైతులందరూ ధాన్యం తీసుకొచ్చి రాశులుగా పోశారు. 14 మంది రైతులకు సంబంధించి మొత్తం 800 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు కేంద్రంలో తూకానికి సిద్ధంగా ఉంది. కేంద్రం ప్రారంభించి రెండు వారాలైనా నేటి వరకు కొనుగోళ్లు ప్రారంభించక పోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం వస్తే తమ వడ్లు తడిసి పోతాయని, సంబంధిత అధికారులు స్పందించి వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలని కోరుతున్నారు.

అంధకారంలో రాంనగర్ కాలనీ

- 24గంటలపాటు విద్యుత్ లేక తీవ్ర ఇబ్బందులు
- ప్రధాన రహదారిపై కాలనీవాసుల ధర్నా
- స్పందించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించిన అధికారులు

భువనగిరి – నలగొండ ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న రామ్‌నగర్ కాలనీవాసులు

భువనగిరి అర్బన్, మే 3 : భువనగిరి పట్టణంలోని రాంనగర్ కాలనీవాసులు 24గంటలపాటు అంధకారంలో గడిపారు. శుక్రవారం రాత్రి 9నుంచి శనివారం రాత్రి 8:30 గంటల వరకు విద్యుత్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎండాకాలం కావడం, ఉబ్బరింత ఎక్కువగా ఉండడంతో చిన్నారులు తట్టుకోలేక ఉక్కిరిబిక్కిరి అయ్యారు. దాంతో చెట్ల కింద సేద తీరాల్సి వచ్చింది. సమస్యను పరిష్కరించి వెంటనే విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ కాలనీవాసులు శనివారం రాత్రి భువనగిరి – నల్లగొండ ప్రధాన రహదారిపై ధర్నాకు దిగారు. దీంతో స్పందించిన అధికారులు ధర్నా వద్దకు వచ్చి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. అయినా విరమించలేదు. దాంతో చేసేదేమీలేక కాలనీలోని విద్యుత్ స్తంభాలను పరిశీలించారు. శుక్రవారం రాత్రి ఈదురు గాలులకు చెట్టు కొమ్మ విరిగి తీగలపై పడడంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. సమస్యను వెంటనే పరిష్కరించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడంతో కాలనీ ప్రజలు ధర్నా విరమించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఏవీ కిరణ్‌కుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు శివకుమార్, అంజద్, రషీద్, సైదులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

నేడు నీట్

ఉదయం 11నుంచి పరీక్ష కేంద్రంలోకి అనుమతి

- 1:30గంటల తర్వాత గేట్లు మూసివేత
- సెంటర్లను పరిశీలించిన కలెక్టర్లు

నల్లగొండలోని పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్ర పవార్

రామగిరి/ నీలగిరి/ సూర్యాపేట, మే 3 : నీట్ ప్రవేశ పరీక్షకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం జరుగనున్న పరీక్షకు నల్లగొండ జిల్లా కేంద్రంలో ఏడు, సూర్యాపేటలో నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేశారు. నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను శనివారం ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలిసి కలెక్టర్ ఇలా త్రిపాఠి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఏడు పరీక్ష కేంద్రాల్లో 2,087 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. పరీక్ష మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు జరుగుతుందన్నారు. ఉదయం 11గంటల నుంచి పరీక్ష కేంద్రాలకు అనుమతి ఇవ్వడం జరుగుతుందని, మధ్యాహ్నం 1:30కు సెంటర్ ప్రధాన గేట్లు మూసివేస్తారని తెలిపారు. అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రంలో తాగునీరు, విద్యుత్, ఫ్యాన్లు, మెడికల్ సౌకర్యాలన్నింటినీ పునఃపరిశీలన చేయాలని సంబంధిత అధికారులను అదేశించారు. ఆమె వెంట అదనపు కలెక్టర్ రాజ్‌కుమార్, అదనపు ఎస్పీ రమేశ్, ఆర్డీఓ యానాల అశోక్‌రెడ్డి, డీఎస్పీ శివరాంరెడ్డి, నీట్ నోడల్ ఆఫీసర్ శ్రీనివాసులు ఉన్నారు.

సూర్యాపేటలో 890 మంది విద్యార్థులు..

సూర్యాపేటలో పరీక్ష కేంద్రాలను కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ పరిశీలించారు. నాలుగు కేంద్రాల్లో నిర్వహించే పరీక్షకు 890 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. కలెక్టర్ వెంట అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, ఆర్డీఓ వేణుమాధవరావు, తాసీల్దార్ శ్యాంసుందర్‌రెడ్డి, కృష్ణయ్య, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ జయలత, పరీక్ష కేంద్రం పర్యవేక్షకులు రమేశ్, పద్మ, వినోద, యాదయ్య ఉన్నారు.

భరత్‌చంద్రకు కలెక్టర్ అభినందన

సంస్థాన్ నారాయణపురం, మే 3 : పదో తరగతిలో 75శాతం మార్కులు సాధించిన విద్యార్థి భరత్‌చంద్రను కలెక్టర్ హనుమంతరావు అభినందించారు. మండలంలోని శేరిగూడెం గ్రామానికి చెందిన భరత్‌చంద్ర కుటుంబ పరిస్థితి బాగాలేక గతంలో పాఠశాలకు వెళ్లలేదు. వారి పరిస్థితి చూసి చలించిన కలెక్టర్ భరత్ చదువు బాధ్యత తీసుకుంటానని దత్తత తీసుకున్నారు. కలెక్టర్ ప్రోత్సాహంతో చదువు కొనసాగించిన భరత్.. బుధవారం విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 75శాతం మార్కులు సాధించి పాసయ్యాడు.

విషయం తెలుసుకున్న కలెక్టర్ శనివారం విద్యార్థి ఇంటికి వెళ్లి భరత్‌ను, తల్లి విజయలక్ష్మిని సత్కరించారు. రూ.5వేలు, రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. కష్టపడి చదువుకుని ఉద్యోగం సాధించి అమ్మను, చెల్లెను మంచిగా చూసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, తాసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఐ పాండు, పంచాయతీ కార్యదర్శి సుభాశ్ ఉన్నారు.

విద్యార్థి భరత్‌చంద్రను అభినందిస్తున్న తెలుపుతున్న కలెక్టర్ హనుమంతరావు

కేసుల్లో ఉన్న బైక్‌లను పత్రాలు చూపించి తీసుకెళ్లాలి

- ఎస్పీ శరత్‌చంద్రపవార్

నీలగిరి, మే 3 : నల్లగొండ జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో కేసుల్లో సీజ్ అయిన వాహనాలను యజమానులు తమ స్టేషన్‌లో సరైన డాక్యుమెంట్లు చూపించి తీసుకెళ్లాలని ఎస్పీ శరతచంద్ర పవార్ శనివారం ఒక ప్రకటనలో సూచించారు. పలు సందర్భాల్లో కేసుల్లో నమోదైన 73 బైక్‌లను జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రానికి తరలించామని తెలిపారు. డాక్యుమెంట్లు చూపించి తీసుకెళ్లకుంటే ఆరు నెలల వ్యవధిలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం బహిరంగ వేలం వేయనున్నట్లు తెలిపారు. వాహనాల పూర్తి వివరాలు జిల్లా అధికారిక ఫేస్‌బుక్, ట్విట్టర్‌లో నమోదు చేసినట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్ నూరప్పనాయుడును 8712670170 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

టీజీఐసెట్‌కు 10 వరకు దరఖాస్తుల గడువు పెంపు

రామగిరి, మే 3 : నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే టీజీ ఐసెట్ దరఖాస్తుల గడువును ఈ నెల 10 వరకు పొడిగించినట్లు ఐసెట్ కన్వీనర్, ఎంజీయూ రిజిస్ట్రార్ అల్వాల రవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు 51,857 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసినట్లు వెల్లడించారు.